కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఆదివారం తెల్లవారుజామునుంచే క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణం ఎటు చూసినా భక్తులతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహాకుంభ మేళా పవిత్ర జలం పంపిణీ

ఘంటసాల: మహా కుంభమేళాకు వెళ్లలేని భక్తులకు దాతల సహకారంతో సేకరించిన మహాకుంభమేళా జలాన్ని శ్రీ జలధీశ్వర స్వామి వారి దేవస్థానంలో పంపిణీ చేస్తున్నట్లు ఆలయాభివృద్ధి కమిటీ నిర్వాహకులు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ తెలిపారు. పలువురు దాతల సహకారంతో సేకరించిన మహా కుంభమేళా పవిత్ర జలాన్ని అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ఆదివారం భక్తులకు పంపిణీ చేశారు.

సాగరతీరానికి తగ్గిన పర్యాటకుల తాకిడి

అధ్వానంగా ఉన్న రోడ్లు, టోల్ వసూలే కారణం

కోడూరు: హంసలదీవి సాగర తీరానికి పర్యాటకుల తాకిడి గణనీయంగా తగ్గింది. సాధారణంగా సెలవు దినాల్లో పాలకాయతిప్ప బీచ్ వద్దకు వేల సంఖ్యలో యాత్రికులు తరలివస్తారు. అయితే ఆదివారం తీరానికి నామమాత్రంగానే పర్యాటకులు తరలివచ్చారు. రహదారులు అధ్వానంగా ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు కూడా బీచ్‌కి రావడానికి ఇష్టం చూపడం లేదు. అవనిగడ్డ-కోడూరు ప్రధాన రహదారిపై ప్రయాణం నరకయాతనగా మారింది. 13 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారి పొడవునా గుంతలు ఏర్పడడంతో పాటు దుమ్ము ధూళితో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు తీరంలో ఏవిధమైన వసతులు కల్పించకుండా బీచ్ గేటు వద్ద అటవీ అధికారులు టోల్‌ను ఏర్పాటు చేయడం కూడా పర్యాటకుల తాకిడి తగ్గడానికి కారణమని పాలకాయతిప్ప మత్స్యకారులు చెప్పుతున్నారు. బీచ్‌లో వెళ్లాలంటే వాహనాలతో పాటు మనుషులకు కూడా టోల్‌ను వసూలు చేయడంతో చుట్టుపక్కల పర్యాటకులు తీరానికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని బాహాటంగానే విమర్శిస్తున్నారు. రహదారులను నిర్మించి, టోల్ వసూలును నిలుపుదల చేసి తీరంలో వసతులు కల్పిస్తే హంసలదీవి సాగరతీరానికి పూర్వవైభవం వస్తుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఆదివారం తీరంలో పర్యాటకులు నామమాత్రంగా ఉండడంతో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు వారికే జాగ్రత్తలు చెబుతూ కనిపించారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం



చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా ఎం.జాన్సన్, సహాధ్యక్షుడిగా డి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా వి.దీపక్, ఆర్థిక కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా బి.నాగేంద్రం, సురేష్, రమాదేవి, సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా గోపాల్‌సింగ్, రాధిక, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

మూడు వేల మందికి అన్నసమారాధన

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం గంగాభవానీ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఆదివారం మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కోడూరు, హంసలదీవి, ఉల్లిపాలెం గ్రామస్తులు ఈ అన్నసమారాధనలో పాల్గొన్నారు. అమ్మవారి వార్షిక జాతరతో పాటు ఆలయ ప్రాంగణంలో నూతన నాగశిల ప్రతిష్టను కనులపండువగా జరిపారు. ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నైవేద్యాలు సమర్పించి భక్తి భావం చాటుకున్నారు.

దేవాంగ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుధీర్



సుధీర్‌కుమార్



సుబ్రమణ్యం

పెడన: దేవాంగ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెడనకు చెందిన ఊటుకూరి ఏకనాథ్ సుధీర్‌కుమార్ నియమితులయ్యారు. విజయవాడలోని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉప కోశాధికారిగా పెడనకు చెందిన పుచ్చల వీరకోట సుబ్రహ్మణ్యం, సంఘ అనుబంధ సంస్థ చేనేత విభాగం రాష్ట్ర కోశాధికారిగా గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన మేడక విశ్వేశ్వరరావు నియమితులయ్యారు. దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా మచిలీపట్నంకు చెందిన యర్ర శ్రీనివాస్ కూడా ప్రమాణస్వీకారం చేసినట్టు తెలిపారు. యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించిన పెద్దలకు సుధీర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో అగస్తేశ్వరస్వామివారి వార్షిక కల్యాణం



బంటుమిల్లి: మండల పరిధిలోని పెద తుమ్మిడి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత అగస్తేశ్వరస్వామి వారి వార్షిక దశమ కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పండితుడు సోమరాజుపల్లి ఈశ్వరశర్మ శిష్య బృందం వేద మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం పలువురు దంపతుల దీక్షధారణలతో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి సువాసినిలచే సామూహిక కుంకుమపూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. సాయంత్రం మేళతాళాలతో ఉత్సవమూర్తులను ట్రాక్టరుపై ఉంచి టపాసులు కాలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ మట్టా విజయలక్ష్మి దంపతులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త లక్కాప్రగడ మాధవరావు దంపతులు, కోశాధికారి జల్లూరి శరభయ్యగుప్త దంపతులతో పాటు పలువురు దంపతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మినప తీతలు



కృత్తివెన్ను: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మినుము తీతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 1400 ఎకరాలలో రైతులు రెండవ పంటగా మినుము సాగు చేపట్టారు. ప్రస్తుతం మండలంలోని చిన పాండ్రాక, చెరుకుమిల్లి గ్రామాల్లో మినప తీతలు జరుగుతున్నట్లు ఏవో ఎస్.జెన్నీ తెలిపారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మినుము పంట అంత ఆశాజనకంగా లేదని దీనికి ప్రధాన కారణం సరైన సమయంలో విత్తనాలు చల్లుకోకపోవడమేనని అధికారులంటున్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలి

ఘంటసాల: ఆపరేషన్ కగార్ పేరుతో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో విచారణ జరిపించాలని ఏపీ పౌర హక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జక్కా కేశవరావు డిమాండ్ చేశారు. ఘంటసాల గోటకంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో బీజేపీ ప్రభుత్వం గిరిజనులపై సాగిస్తున్న ఎన్ కౌంటర్లను ఆపివేయాలన్నారు. జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, ఒడిశా, ఏఓబీ ప్రాంతాలలో సాయుధ పారామిలటరీ బలగాలతో నిరాయుధులైన గిరిజనుల హత్యలను ఖండిస్తున్నామన్నారు. బూటకపు ఎన్ కౌంటర్లపై విచారణ జరిపి బాధ్యులైన పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.



పంచాయతీలు పాలనకు పట్టుకొమ్మలు



లక్ష్మీపురంలో అందంగా రూపుదిద్దుకున్న రైతు భరోసా కేంద్రం

- గ్రామ సచివాలయ వ్యవస్థతో సరికొత్త రూపు
- పరిపాలన అంతా పారదర్శకమే
- ముంగిట్లోకే ప్రభుత్వ పథకాలు

కృత్తివెన్ను: ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో గ్రామాల పాత్ర అమోఘమైనది. అటువంటి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, పాలనను ప్రజల చెంతకు చేర్చడంలో కీలకమైన పాత్ర పోషించింది గ్రామ సచివాలయ వ్యవస్థ. శాశ్వత కట్టడాలతో కార్యాలయాలు, ముంగిట్లోకే ప్రభుత్వ పథకాలు, వలంటీర్ వ్యవస్థతో పారదర్శక పాలన అందించడంలో సచివాలయాలు ప్రజల మన్ననలు చూరగొన్నాయి. గ్రామీణ పాలన అంతా ఒకే చోట కేంద్రీకృతమయ్యేలా సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ పేరుతో అన్నింటిని ఒకే చోట నిర్మించి ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసింది సచివాలయ వ్యవస్థ.

గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది

దేశ సౌభాగ్యం గ్రామాభివృద్ధితోనే సాధ్యమన్న విషయాన్ని గుర్తించి పేదవర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో గ్రామాలకు మరింత శోభ చేకూరింది. ఇదే తరహాలో మారుమూల పల్లెల్లో పటిష్టమైన రోడ్ల నిర్మాణం, శాశ్వత అంతర్గత డ్రైనేజీలతో అభివృద్ధి దిశగా పల్లెలు కదిలాయి.

ఇంటి వద్దకే వైద్య సేవలు

ఆస్తిపాస్తుల కంటే ఆరోగ్యం అధికమైన సంపద అన్న సూక్తిని పాటిస్తూ ఇంటింటికీ వైద్యుల్ని పంపి ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. రక్త నమూనాల సేకరణ, బీపీ, షుగర్ లాంటి వైద్య పరీక్షలు మొదలైనవి ఇంటి వద్దే నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి...

గ్రామాలలో అపరిశుభ్ర వాతావరణం లేకుండా ప్రత్యేక పారిశుద్ధ్యం పేరుతో అధికారుల పర్యవేక్షణలో డ్రైవ్‌లు నిర్వహించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ పేరుతో చెత్త నుంచి సంపద కేంద్రాలు నెలకొల్పి ప్రతి ఇంటి నుంచి తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా సేకరించి గ్రామాలలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచారు. మారుమూల పల్లెలో చక్కని విద్యుత్ దీపాల వెలుగులు, అవసరమైన చోట నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. నాడు పాలకులు ముందు చూపుతో గ్రామీణ వ్యవస్థ బలోపేతం కోసం చేసిన సేవలను కొనసాగించి గ్రామీణ వ్యవస్థ మరింత ముందుకు సాగేలా చూడాలన్నదే ప్రజల ఆకాంక్ష.



లక్ష్మీపురంలో అధునాతనంగా నిర్మాణం చేసిన గ్రామ సచివాలయ భవనం

నేడు పాగోలు కైవల్యాశ్రమంలో విశేష పూజలు

చల్లపల్లి: చల్లపల్లి మండలం పాగోలు గ్రామంలోని కైవల్యాశ్రమ చలాచలబోధోపదేశ మందిరంలో కమలాత్మికా సహిత అచలేశ్వర విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ట్రస్టీలు మేకా సత్యనారాయణ ప్రసాద్(బంగారుబాబు), మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం మంగళతోరణం, మంగళ వాయిద్యం, గోపూజ అనంతరం విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచనం, పుణ్యాహవాచనం, ప్రతిష్ఠాసంకల్పం, సప్తస్థల మాతృకా పూజ, యాగశాల ప్రవేశం, షోడశ స్తంభ పూజ, మృత్సంగ్రహణం, అఖండ దీపస్థాపన, దశ మహావిద్య మూలమంత్ర జపములు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.